# మన చౌరాస్తా
తెలుగు దినపత్రిక




ప్రారంభోత్సవాలు.. పరామర్శలు..

- జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి జోరుగా పర్యటన

3


సంపుటి : 01 | సంచిక : 297 | ఎడిటర్ : ఉప్పలంచి నరేందర్ | మంగళవారం, 06 అక్టోబర్ 2026 | పేజీ :4






ఓటు చోరీకి వ్యతిరేకంగా గాంధీభవన్‌లో సత్యాగ్రహ దీక్ష 3

## విద్యార్థినులకు పరిశుభ్రమైన వాతావరణం కల్పించాలి

- నాణ్యమైన పౌష్టికాహారం అందించాలి
- కలెక్టర్ సందీప్ కుమార్ ఝా
- నర్మెట్ట ఎస్టీ హాస్టల్‌ను తనిఖీ చేసిన కలెక్టర్

**జనగామ, మన చౌరాస్తా :** విద్యార్థినులకు పరిశుభ్రమైన వాతావరణం కల్పించాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అన్నారు. సోమవారం జిల్లాలోని నర్మెట్ట మండల కేంద్రంలో గల గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల (బాలికలు)ను జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా సందర్శించి, ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థినులకు అందుతున్న విద్యా బోధన, పరీక్షల నిర్వహణ, వసతి, భోజనం, పారిశుద్ధ్యం, మౌలిక వసతులు, తదితర అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ప్రతి తరగతి గదిని సందర్శించి, తరగతి గదుల నిర్వహణ, ప్రస్తుతం జరుగుతున్న పరీక్షల విధానం, పరీక్షల నిర్వహణ తీరును పర్యవేక్షించి, విద్యార్థినులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పరీక్షలు సక్రమంగా నిర్వహించేలా చూడాలని సూచించారు. పాఠశాలలోని వంటశాల గదిని సందర్శించి, విద్యార్థులకు నాణ్యమైన పౌష్టికాహారం అందించాలని, మెనూ ప్రకారం తాజా కూరగాయలను వినియోగిస్తూ, నాణ్యమైన ఆహారం అందేలా చూడాలని ఆదేశించారు. ఆయా సబ్జెక్టులపై విద్యార్థులకు ఉన్న సామర్థ్యాన్ని పరిశీలించారు. విద్యార్థుల విద్యా ప్రమాణాలను మెరుగుపరిచేలా బోధన అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. పాఠశాలలో విద్యార్థులకు అవసరమైన అన్ని మౌలిక వసతులను కల్పించాలని, ఇంకా అవసరమైన ఫ్యాన్లు, లైట్లు సమకూర్చాలని సూచించారు. అనంతరం పాఠశాలలోని డార్మిటరీలను పరిశీలించిన కలెక్టర్, విద్యార్థినుల వసతి పరిస్థితులను, గదుల పరిశుభ్రతను పర్యవేక్షించారు. పాఠశాలలోని సరకుల నిల్వ గదిని తనిఖీ చేసిన కలెక్టర్, అక్కడ నిల్వ చేసిన సరుకులను పరిశీలించారు. అనంతరం భోజనశాలను సందర్శించి, విద్యార్థినులకు అందించే భోజనానికి ఉపయోగించే కూరగాయలు, ఇతర సరుకుల నాణ్యత, నిల్వ విధానాన్ని పరిశీలించారు. కూరగాయలు తాజాగా ఉండేలా, విద్యార్థినులకు నాణ్యమైన, పరిశుభ్రమైన ఆహారం అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే పాఠశాలలోని మరుగుదొడ్లు, మూత్రశాలలను పరిశీలించిన కలెక్టర్, వాటి పరిశుభ్రత, నిర్వహణపై ఆరా తీశారు. విద్యార్థినుల ఆరోగ్యం, భద్రతను దృష్టిలో ఉంచుకొని, ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పాఠశాల మైదానం, పరిసరాలను పరిశీలించిన కలెక్టర్, పాఠశాల పరిసరాల్లో పేరుకుపోయిన చెత్తాచెదారం, పిచ్చి మొక్కలను తొలగించి, అనవసరంగా నిల్వ ఉంచిన సామగ్రిని వెంటనే తీసివేయాలని ఆదేశించారు. విద్యార్థినులు విద్యనభ్యసించే, నివసించే ప్రదేశం పరిశుభ్రంగా ఉండేలా నిరంతరం పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని సూచించారు. విద్యార్థినుల విద్యతో పాటు వారి ఆరోగ్యం, భద్రత, వసతి, భోజనం, ఆహ్లాదకరమైన వాతావరణం కూడా ఎంతో ముఖ్యమని కలెక్టర్ స్పష్టం చేశారు. తనిఖీలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు కిష్ట, తహసీల్దార్ వెంకట రామానుజ చారి, సర్పంచ్ శ్రీధర్, పంచాయతీ కార్యదర్శి నజీర్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.


# wanted
## విలేకరులు కావలెను



మన చౌరాస్తా తెలుగు దినపత్రిక స్థాపించిన అనతి కాలంలోనే పాఠకుల విశేష ఆదరణ పొందుతూ డిజిటల్ మీడియా రంగంలో దూసుకెళ్తోంది. స్థానిక సమస్యలపై, రాజకీయ, ఎడ్యుకేషన్, ఆరోగ్యం, సినిమా వార్తలు అందిస్తూ అందరి మన్ననలు పొందుతూ ముందుకు సాగుతోంది. మా పత్రికలో పనిచేయుటకు అనుభవం, ఆసక్తి గల జిల్లా స్టాఫ్ రిపోర్టర్లు, మండల రిపోర్టర్లు కావలెను.. పూర్తి వివరాలకు ఈ కింది నంబర్లలో సంప్రదించగలరు.

manachourasta@gmail.com

8555800812 9676400812

# ప్రజావాణి అర్జీలపై ప్రత్యేక దృష్టి

- కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

**జనగామ, మన చౌరాస్తా :** ప్రజావాణిలో వివిధ సమస్డలతో వచ్చే ప్రజల అర్జీలను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని మెయిన్ కాన్ఫరెన్స్ హాల్లో నిర్వహించిన ప్రజావాణిలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బెన్షాలోమ్ తో కలిసి జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఫిర్యాదులను స్వీకరించి, పరిశీలించారు. ఈ సందర్భంగా 405 అర్జీలను కలెక్టర్ స్వీకరించారు. వచ్చిన దరఖాస్తులను సంబంధిత శాఖల అధికారులకు కేటాయిస్తూ, ప్రజా సమస్యలపై తగిన చర్యలు తీసుకొని, త్వరితగతిన పరిష్కరించేందుకు కృషి చేయాలని అధికారులకు సూచించారు. ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారంలో వేగం పెంచాలని, పెండింగ్ లో లేకుండా దరఖాస్తులను ఎప్పటికప్పుడు పూర్తిచేయాలని ఆదేశించారు. ఈరోజు ప్రజావాణికి వచ్చిన కొన్నింటి దరఖాస్తుల వివరాలిలా ఉన్నాయి.



- హిమ్మత్ నగర్ గ్రామం జఫర్గడ్ మండలానికి చెందిన సీహెచ్. అనిత, తనకు పెంకుటిల్లు ఉందని, అది కూలిపోయిందని, ఇందిరమ్మ ఇళ్ల కింద గుర్తించి, ఆర్థిక సహాయం కొరకు మనవి చేస్తూ దరఖాస్తు చేసుకున్నారు.
- నెల్లుట్ల గ్రామం, లింగాల ఘనపురం మండలానికి చెందిన బంద్రు సారమ్మ, తనకు మూడు ఎకరాల భూమి ఉందని, అందులోని 16 గుంటల భూమి రికార్డులోకి ఎక్కలేదని, ఆ భూమిని రికార్డులోకి ఎక్కించి, పట్టా ఇప్పించగలరని దరఖాస్తు చేసియున్నారు.
- నారాయణపురం గ్రామం, బచ్చన్నపేట మండలానికి చెందిన రవీందర్ రెడ్డి, సదాశివపేట, నారాయణపురం మధ్యలో కాలువ తెగిపోయిందని, కాలువ మరమ్మతులు చేయాలని ప్రార్థిస్తూ ఆర్జీ ద్వారా కోరారు.
- పాముసూర్ గ్రామం, ఘనపూర్ (స్టేషన్) మండలానికి చెందిన రేష్మా, తన పెంకుటిల్లు కూలిపోయే దశలో ఉందని, చాలా పేద కుటుంబానికి చెందినదని, ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయగలరని కోరుతూ వినతిపత్రం సమర్పించనైనది.
- విస్నూర్ గ్రామం, పాలకుర్తి మండలానికి చెందిన ఎం. సుజాత, ఇందిరమ్మ ఇల్లు ఇప్పించుట కోసం దరఖాస్తును సమర్పించినారు. ఈ ప్రజావాణిలో జెడ్పీ సీఈవో బలరామ రావు, డీఆర్డీఓ భాస్కర్, సీపీఓ చిన కోట్యా నాయక్, వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.





# 'నారాయణ'లో ఘనంగా ఎస్ఎల్సీ కార్యక్రమం

**జనగామ, మన చౌరాస్తా :** జనగామ జిల్లా కేంద్రంలోని నారాయణ పాఠశాలలో విద్యార్థుల నేతృత్వ సమావేశం (స్టూడెంట్ లెడ్ కాన్ఫరెన్స్ SLC) ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ఈ కిడ్స్ ఆర్డీ ప్రతినిధి సంగీత, జోనల్ డీజీఎం రిజ్వానా ఇమ్రాన్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సంగీత మాట్లాడుతూ పాఠశాల స్థాయి నుండే విద్యార్థులు తమ విద్యా పురోగతిని, అభ్యాస అనుభవాలను తల్లిదండ్రులకు స్వయంగా ప్రదర్శించడం అభినందనీయమని పేర్కొన్నారు. ఇది పిల్లలలో మాట్లాడే నైపుణ్యాలు, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడానికి ఎంతగానో దోహదపడుతుందన్నారు. అనంతరం జోనల్ డీజీఎం రిజ్వానా ఇమ్రాన్ మాట్లాడుతూ విద్యార్థులు తమ తరగతి గదులను అలంకరించి, నేర్చుకున్న అంశాలను తల్లిదండ్రులకు ప్రదర్శించడం వారి స్వతంత్ర ఆలోచనలకు, బాధ్యతారాహిత్యం లేని అంకితభావానికి నిదర్శనమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ ఫర్హానా, ఈకిడ్స్ కోఆర్డినేటర్ శిరీష, ఏవో చారి, ఈ కిడ్స్ ఇన్‌ఛార్జ్ మమత, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.







# హలో మాదిగ విద్యార్థి.. చలో ఉస్మానియా

**భీమదేవరపల్లి, మన చౌరాస్తా :** ఉస్మానియా విశ్వవిద్యాలయంలో రేపు నిర్వహించనున్న ఎమ్మెస్ఎఫ్ జాతీయ విద్యార్థుల సమావేశానికి భీమదేవరపల్లి మండలం నుంచి విద్యార్థులు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ హుస్నాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి మాట్ల వెంకటస్వామి మాదిగ, మండల అధ్యక్షుడు వేల్పుల ప్రశాంత్ మాదిగ పిలుపునిచ్చారు. పద్మశ్రీ మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న ఈ సమావేశానికి విద్యార్థులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని వారు కోరారు. కార్యక్రమంలో ఎమ్మెస్పీ మండల అధ్యక్షుడు కాదాసు ప్రవీణ్, అధికార ప్రతినిధి మాడుగుల ప్రణయ్, సీనియర్ నాయకులు నాగిళ్ల చందర్, పార్నందుల సురేష్, బొల్లంపల్లి జోసెఫ్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



# గాంధీనగర్‌లో ఉచిత వైద్య శిబిరం

**గాంధీనగర్, మన చౌరాస్తా :** గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య ఆరోగ్య శిబిరాన్ని గ్రామ సర్పంచ్ కేతిరి లక్ష్మారెడ్డి సందర్శించారు. శిబిరంలో ఎంతమంది రోగులకు వైద్య సేవలు అందించారు, ఎలాంటి పరీక్షలు నిర్వహించారు అనే వివరాలను వైద్య సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. గ్రామ ప్రజలకు రక్తపోటు, మధుమేహం తదితర పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేస్తున్న వైద్యులు, నర్సులు, ఆశా కార్యకర్తలకు సర్పంచ్ కృతజ్ఞతలు తెలిపారు. ప్రజలు శిబిరాన్ని సద్వినియోగం చేసుకుని ఆరోగ్యంపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ బుర్ర సమ్మయ్య, వార్డు సభ్యులు, పంచాయతీ కార్యదర్శి, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# కులం పేరుతో దూషించిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలి




**భీమదేవరపల్లి, మన చౌరాస్తా :** కులం పేరుతో దూషించిన వ్యక్తిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ ఎమ్మార్పీఎస్ నాయకులు సోమవారం భీమదేవరపల్లి మండల ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. ఎమ్మార్పీఎస్ భీమదేవరపల్లి మండల అధ్యక్షుడు వేల్పుల ప్రశాంత్, ఫిర్యాదుదారు మాట్ల వెంకటస్వామి తెలిపిన వివరాల ప్రకారం.. ఆరు నెలల క్రితం రఘునాథుల బాపురెడ్డి భూమి కొనుగోలు చేసేందుకు వచ్చిన వారికి భూమి చూపించేందుకు వెళ్లిన సమయంలో రఘు నాయకుల ప్రదీప్‌రెడ్డి తమను కులం పేరుతో దూషించాడని ఆరోపించారు. అడ్డుకోవడానికి ప్రయత్నించినా వినకుండా దూషిస్తూ, దాడికి ప్రయత్నించాడని పేర్కొన్నారు. ఈ ఘటనపై ఏప్రిల్ 5న వంగర పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశామని, ఎస్సై సాక్షులను పిలిపించి విచారణ కూడా చేపట్టారని తెలిపారు. అయితే ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. తమను కులం పేరుతో దూషించిన వ్యక్తిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని ప్రజావాణిలో అధికారులను కోరారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు మాట్ల వెంకటస్వామి, మండల అధ్యక్షుడు వేల్పుల ప్రశాంత్, ఎంఎస్పీ మండల అధ్యక్షుడు కాదాస్ ప్రవీణ్, జిల్లా నాయకుడు పారినందుల సురేష్, బొల్లంపల్లి జోసెఫ్, మాడుగుల ప్రణయ్‌దేవ్ పాల్గొన్నారు.



# అర్హులైన నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయాలి

- **డబుల్ బెడ్ రూం ఇళ్ల పరిశీలన ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించాలి**
- **ఇందిరమ్మ ఇళ్ల పెండింగ్ దరఖాస్తులను వెంటనే పూర్తి చేయాలి**
- **కలెక్టర్ సందీప్ కుమార్ ఝా**

**జనగామ, మన చౌరాస్తా :** అర్హులైన నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అధికారులను ఆదేశించారు. సోమవారం, జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద మంజూరైన ఇళ్ల నిర్మాణాల పురోగతి, రెండు పడక గదుల ఇళ్ల కేటాయింపుకు సంబంధించిన ధ్రువపత్రాల పరిశీలన ప్రక్రియ, పెండింగ్ దరఖాస్తులపై అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బెన్షాలోమ్‌తో కలిసి జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. రెండు పడక గదుల ఇళ్ల కేటాయింపుకు సంబంధించి లబ్ధిదారుల ధ్రువపత్రాల పరిశీలన ప్రక్రియను ఎలాంటి తప్పులకు తావులేకుండా వేగంగా, పారదర్శకంగా చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అర్హత కలిగిన ప్రతి లబ్ధిదారుడికి న్యాయం జరిగేలా, అనర్హులకు ఇళ్లు మంజూరు కాకుండా నిబంధనల ప్రకారం క్షుణ్ణంగా పరిశీలన చేయాలన్నారు. మొదటి విడతలో ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి 3,500 ఇళ్లు మంజూరు చేసినట్లు తెలిపారు. పాలకుర్తి, జనగామ నియోజకవర్గాల్లో పెండింగ్ లో ఉన్న ఇళ్ల దరఖాస్తుల పరిశీలన ప్రక్రియను వేగవంతం చేసి, త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. దరఖాస్తుల పరిశీలనలో రేషన్ కార్డు, ఆదాయ ధృవీకరణ పత్రం కీలకంగా పరిగణించాలని సూచించారు. కుటుంబంలోని పెద్దలు, వయోజనుల వివరాలను రేషన్ కార్డు ఆధారంగా పరిశీలించడంతో పాటు, కుటుంబంలోని కుమారులు వేర్వేరుగా రేషన్ కార్డులు తీసుకొని, ప్రత్యేకంగా నివసిస్తున్న సందర్భాల్లో వారి అర్హతలను కూడా నిబంధనల ప్రకారం సరి చూడాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో రూ.1.50 లక్షలు, పట్టణ ప్రాంతాల్లో రూ.2 లక్షల వరకు వార్షిక ఆదాయం ఉన్నవారిని ఆదాయ పరిమితి నిబంధనల ప్రకారం పరిగణనలోకి తీసుకోవాలని సూచించారు. ఆదాయ ధృవీకరణ పత్రాలు ప్రతి సంవత్సరం మారే అవకాశం ఉన్నందున వాటిని తప్పనిసరిగా ధృవీకరించి తగిన చర్యలు తీసుకోవాలన్నారు. లబ్ధిదారులకు భూమి, ఇల్లు (లేదా) ఇతర ఆస్తులు ఉన్నాయా అనే విషయాన్ని సంబంధిత ప్రభుత్వ వెబ్ సైట్ల ద్వారా పరిశీలించాలని ఆదేశించారు. కుటుంబ సభ్యులకు ఇతర ప్రాంతాల్లో ఇళ్లు, భూములు, ఆస్తులు ఉన్నట్లయితే స్థానికంగా విచారణ జరిపి, వాస్తవాలను నిర్ధారించుకోవాలని సూచించారు. చెక్‌లిస్ట్‌లోని వివరాల పరిశీలనతో పాటు, ఏవైనా సందేహాలు ఉన్న సందర్భాల్లో క్షేత్రస్థాయిలో స్థానిక విచారణ చేపట్టాలని తెలిపారు. అన్ని వివరాలను క్షుణ్ణంగా పరిశీలించిన అనంతరం మాత్రమే దరఖాస్తులను ఆమోదించడం (లేదా) తిరస్కరించడం చేయాలని స్పష్టం చేశారు. గుడిసెలకు సంబంధించిన జాబితాను కూడా క్షేత్ర స్థాయిలో పరిశీలించి, వాస్తవంగా అర్హులైన వారి వివరాలను నమోదు చేయాలని సూచించారు. అలాగే ఇందిరమ్మ ఇళ్ల పెండింగ్ దరఖాస్తులను వెంటనే పూర్తి చేయాలని సూచించారు. అదే విధంగా ఆయా మండలాల పరిధిలో బేస్‌మెంట్ లెవల్, రూఫ్ లెవల్, రూఫ్ కాస్టెడ్ వంటి వివిధ దశల్లో ఉన్న ఇళ్ల నిర్మాణాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఈఆఫీస్ విధానాన్ని తప్పనిసరిగా వినియోగిస్తూ, కార్యాలయ ఫైళ్ల ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని స్పష్టం చేశారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం అమలులో నిబంధనల ప్రకారం అర్హులైన లబ్ధిదారులకు ఇళ్ల మంజూరు ప్రక్రియను సజావుగా పూర్తి చేయాలని ఆదేశించారు. సమావేశంలో గృహ నిర్మాణ శాఖ పీడీ బలరామ రావు, మునిసిపల్ కమిషనర్ రాజశేఖర్ రెడ్డి, ఎంపిడిఓలు మహేష్ నాయక్, లావణ్య, ఇతర సంబంధిత అధికారులు ఏఈలు పాల్గొన్నారు.

## ఓటు చోరీకి వ్యతిరేకంగా గాంధీభవన్‌లో సత్యాగ్రహ దీక్ష

**జనగామ, మన చౌరాస్తా :** ఓటు చోరీపై కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూ, కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ (CEC) జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ హైదరాబాద్ గాంధీభవన్‌లో నిర్వహిస్తున్న సత్యాగ్రహ దీక్షకు జనగామ జిల్లా సేవాదళ్ శ్రేణులు భారీగా తరలివెళ్లాయి. టీపీసీసీ సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షుడు మిద్దెల జితేందర్ పిలుపు మేరకు, జిల్లా అధ్యక్షుడు జాయ మల్లేష్ ఆధ్వర్యంలో సోమవారం ఉదయం సేవాదళ్ నాయకులు, కార్యకర్తలు గాంధీభవన్‌కు చేరుకున్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్, నియోజకవర్గ, మండల, పట్టణ, గ్రామ మరియు వార్డు స్థాయి నాయకులు, కార్యకర్తలు విశేష సంఖ్యలో పాల్గొని సత్యాగ్రహ దీక్షను జయప్రదం చేశారు.





## మెన్స్ వేర్ స్టోర్ ప్రారంభించిన ఎమ్మెల్యే పల్లా

**జనగామ, మన చౌరాస్తా :** జనగామ పట్టణ కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఏఎస్ ఫ్యాషన్ షో జోన్ మెన్స్ వేర్ స్టోర్‌ను సోమవారం జనగామ ఎమ్మెల్యే డాక్టర్ పల్లా రాజేశ్వర్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా స్టోర్ నిర్వాహకు లకు శుభాకాంక్షలు తెలిపారు. పట్టణంలో నూతన వాణిజ్య సంస్థలు ఏర్పాటు కావడం ద్వారా ప్రజలకు మరిన్ని సేవలు, ఉపాధి అవకాశాలు అందుబాటులోకి వస్తాయని ఎమ్మెల్యే పల్లా పేర్కొన్నారు. స్టోర్ నిర్వాహకులు వినియోగదారులకు నాణ్యమైన దుస్తులు, మెరుగైన సేవలు అందించాలని ఆకాంక్షించారు.

**డాక్టర్ నాగేశ్వర్‌రావును పరామర్శించిన ఎమ్మెల్యే**

జనగామ పట్టణ కేంద్రంలో డాక్టర్ పులిగిల్ల నాగేశ్వర్‌రావు తల్లి పులిగిల్ల రాములమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. సోమవారం విషయం తెలుసుకున్న జనగామ ఎమ్మెల్యే డాక్టర్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి వారి నివాసానికి చేరుకుని రాములమ్మ చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఎమ్మెల్యే కుటుంబ సభ్యులను పరామర్శించి, తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు.



## జనగామ ఏరియా ఆసుపత్రి వద్ద అన్నదానం



**జనగామ, మన చౌరాస్తా :** రంగు నర్సయ్య జ్ఞాపకార్థం ఆయన కుమారుడు రంగు మహేష్ ఆధ్వర్యంలో జనగామ జిల్లా ఏరియా ఆసుపత్రి వద్ద ప్రజలకు మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంతెన మణికుమార్, ప్రధాన కార్యదర్శి వంగ భీమ్‌రాజు మాట్లాడుతూ దాత రంగు మహేష్ కుటుంబ సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు. వివాహ మహోత్సవాలు, పుట్టిన రోజులు లేదా జ్ఞాపకార్థ సందర్భాల్లో ప్రతి ఒక్కరూ పేదల ఆకలి తీర్చే సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని, నేటి యువతకు ఆదర్శంగా నిలవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అమ్మ ఫౌండేషన్ ప్రతినిధులు కొయ్యడ రవి, తోకల హరీష్, గొల్లూరి చందు, బొల్లం కనకరాజు, ఎండి పాషా, సిద్ధిరాల చందు, మంద సాయి, ఎండి అఫ్రోజు, బింగి నరసింహులు, కొయ్యడ విశ్వ, సాయి తేజ్ తదితరులు పాల్గొన్నారు.

## దశాబ్దాల నిరీక్షణకు తెర

**భీమదేవరపల్లి, మన చౌరాస్తా :** భీమదేవరపల్లి మండలం ముల్కనూరు గ్రామంలోని బండమీద వడ్డెర కాలనీ వాసుల దశాబ్దాల నిరీక్షణకు ఎట్టకేలకు తెరపడింది. విద్యుత్ సౌకర్యం లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్న కాలనీలో విద్యుత్ స్తంభాలు, వైరింగ్, వీధి దీపాలను ఏర్పాటు చేశారు. దీంతో కాలనీ అంతా విద్యుత్ వెలుగులతో నిండిపోవడంతో నివాసితులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కాలనీవాసులు ప్రజాప్రతినిధులు, విద్యుత్ శాఖ అధికారులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో విద్యుత్ శాఖ సహాయ ఇంజినీర్ లక్ష్మణ్ నాయక్, లైన్‌మన్ విజయ్, ముల్కనూరు సర్పంచ్ జాలి ప్రమోద్ రెడ్డి, ఉపసర్పంచ్ మమతా బాలకృష్ణ, వార్డు సభ్యులు వసంత, శ్రీను తదితరులు పాల్గొన్నారు.








# 'వారణాసి'లో మరో స్టార్ హీరోయిన్

రాజమౌళి దర్శకత్వంలో , మహేష్ బాబు ప్రధాన పాత్రలో నటించిన 'వారణాసి' చిత్రం భారతదేశంలోనే కాకుండా ప్రపంచవ్యాప్తంగా కూడా అత్యంత ఆసక్తిగా ఎదురుచూస్తున్న చిత్రాలలో ఒకటి. ఈ చిత్రంలో మహేష్ బాబు హీరోగా, పృథ్వీరాజ్ సుకుమారన్ విలన్‌గా నటిస్తున్నారు. ప్రియాంక చోప్రా ఈ చిత్రంలో హీరోయిన్‌గా నటించారు. ప్రియాంక చోప్రా భారతీయ నటి అయినప్పటికీ, ఆమె ప్రస్తుతం హాలీవుడ్‌లోనే ఎక్కువగా చురుకుగా ఉంటున్నారు. ఇదిలా ఉండగా, ఈ చిత్రంలో ప్రియాంక చోప్రాతో పాటు మరో హాలీవుడ్ నటి కూడా నటిస్తోందని తెలుస్తోంది. బ్రిటిష్ నటి డైసీ జెస్సికా ఎడ్గర్ జోన్స్ 'వారణాసి' చిత్రంలో ఒక కీలక పాత్ర పోషిస్తున్నట్లు పుకార్లు వినిపిస్తున్నాయి. మహేష్ బాబు, డైసీల మధ్య కొన్ని రొమాంటిక్ సన్నివేశాలు ఉన్నాయని, వారి కెమిస్ట్రీయే సినిమాకు ప్రధాన ఆకర్షణ అని అంటున్నారు. ఈ విషయంపై సోషల్ మీడియాలో చాలా చర్చ జరుగుతోంది. అయితే, చిత్ర బృందం దీనిపై ఇంకా ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదు. వారణాసి కంటే రాజమౌళి తెరకెక్కించిన 'RRR' చిత్రంలో జూనియర్ ఎన్టీఆర్ సరసన 'జెన్నీ' అనే బ్రిటిష్ అమ్మాయి పాత్ర కోసం డైసీని మొదట ఎంపిక చేశారు. కానీ వ్యక్తిగత కారణాలు, షెడ్యూల్ సమస్యల వల్ల ఆమె ఆ ప్రాజెక్ట్ నుంచి తప్పకుంది. ఇప్పుడు, రాజమౌళి ఆమెను తిరిగి తీసుకువచ్చారని తెలుస్తోంది. ఈ వార్తలు నిజమైతే, డైసీ 'వారణాసి' చిత్రంతో భారతీయ చిత్రసీమలో అరంగేట్రం చేయనుంది. ఇదిలా ఉంటే అంటార్కిటికాలో చిత్రీకరిస్తోన్న మొట్టమొదటి భారతీయ చిత్రం వారణాసి కానుంది. అక్కడి కఠినమైన వాతావరణం, కట్టుదిట్టమైన నిబంధనల కారణంగా, ప్రపంచవ్యాప్తంగా కేవలం కొన్ని సినిమాలు మాత్రమే అక్కడ చిత్రీకరణ జరపగలిగాయి. ఇప్పుడు వారణాసి ఈ జాబితాలో చేరనుంది. అత్యాధునిక, భారీ విజువల్స్‌కు పేరుగాంచిన రాజమౌళి, ఈ చిత్రాన్ని సుమారు రూ. 1,300 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్నట్లు సమాచారం. దీంతో ఇది భారతదేశంలో రెండో అత్యంత భారీ బడ్జెట్ చిత్రంగా నిలుస్తుందని అంటున్నారు. మహేష్ బాబు సరసన బాలీవుడ్ నటి ప్రియాంక చోప్రా కథానాయికగా నటిస్తుండగా, పృథ్వీరాజ్ సుకుమారన్‌తో సహా పలువురు స్టార్స్ ఈ మూవీలో కీలక పాత్రలు పోషిస్తున్నారు. కాగా వచ్చే ఏడాది ఏప్రిల్ 7న 'వారణాసి' సినిమాను విడుదల చేస్తానని రాజమౌళి ఇప్పటికే అధికారికంగా ప్రకటించారు.

Printed and Published by **UPPALANCHI POORNIMA** on behalf of UPPALANCHI POORNIMA, Printed at Hamara Warangal Printers and Graphics H.no.25-8-182, Balaji Nagar, Kazipet, Warangal, 506003., Published at H.No.4-8-65, Dharmakancha, Jangaon, Jangaon District. Telangana, 506167, Editor : **UPPALANCHI NARENDER**. Ph : **8555800812**, RNI : **TGTEL/25/A4350**